పెరిగిన దిగుమతులు

కాగా, కర్నూల్, హైదరాబాద్ మార్కెట్‌లకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది లారీల ఉల్లి దిగుమతులు వచ్చిన కారణంగా ధరలు పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు. బయట నుంచి వచ్చే ఉల్లి ధర కన్నా మన మార్కెట్‌లో రూ.200 నుంచి రూ.300 వరకు ఎక్కువగా ఉందని వారు పేర్కొన్నారు.

19న తెలంగాణ కామర్స్ ఫెస్ట్

- పీయూలో ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్ విడుదల

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 13 : పాలమూరు యూనివర్సిటీలో ఈనెల 19న తెలంగాణ కామర్స్ అసోసియేషన్, పీయూ కామర్స్ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న యూనివర్సిటీ స్థాయి ఇంటర్ కాలేజ్ కామర్స్ ఫెస్ట్ ప్రేరణ నిర్వహించనున్నట్లు కామర్స్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. కామర్స్ ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన బుధవారం పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్‌తో కలిసి విడుదల చేశారు. ఫెస్ట్ కార్యక్రమంలో వ్యాసరచన, రంగోలి, బిజినెస్ క్విజ్, ఫేస్ పెయింటింగ్, కామర్స్ క్వెస్టా, పేపర్ ప్రజెంటేషన్, జస్ట్ మినిట్, వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ అనురాధారెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ రంగప్ప, డాక్టర్ వెంకటేష్ తదితరులున్నారు.


తెలంగాణ కామర్స్ ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్స్‌ను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, కామర్స్ విభాగం అధికారులు

ప్రపంచ దేశాల సరసన భారత్

భారతదేశం సాంకేతిక రంగంతో పాటు, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ, అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ ఆయా దేశాల సరసన నిలుస్తున్నదని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ తెలిపారు. బుధవారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్‌లో వర్చువల్ ద్వారా సెమీ కండక్టర్స్ ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీస్ శిలాఫలకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించగా వీసీ తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ మాట్లాడుతూ మన దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, యువకులకు చాలా అవకాశాలు వస్తాయని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీయూ పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- బస్‌షెల్టర్‌కు ఢీ..
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు


నరసింహగౌడ్ (ఫైల్)

కొత్తకోట, మార్చి 13 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రాయనిపేట గ్రామ శివారు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది.

ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అప్పరాల గ్రామానికి చెందిన అక్కల నరసింహగౌడ్(45), రమేష్ అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంపై బుధవారం కొత్తకోట నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా రాయనిపేట గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో నరసింహగౌడ్ తలకు బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. తన నియోజకవర్గంలోని తోమాలపల్లి గ్రామం నుంచి కొత్తకోట మీదుగా వస్తుండగా ప్రమాదాన్ని చూసి తన కాన్వాయ్‌ను ఆపారు. క్షతగాత్రులను పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం తన వాహనంలో వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

మహిళను ఢీకొన్న బైక్.. ముగ్గురికి గాయాలు

గోపాల్‌పేట : రోడ్డు దాటే క్రమంలో వేగంగా వచ్చిన బైక్ మహిళను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ నగదు తీసుకునేందు కోసం మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు వద్దకు వెళ్తు రోడ్డును దాటుతుండగా, మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వస్తూ ఆమెను ఢీకొన్నారు. ప్రమాదంలో మహిళతో పాటు, బైక్ వెనుక సీటుపై కూర్చున్న యువకుడికి తీవ్ర గాయాలు కాగా, బైక్ నడుపుతున్న మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వస్తున్న ఎస్సై హరిప్రసాద్ గాయపడిన వారిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి ఆటోలో పంపించారు. మహిళను చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కందనూలు, మార్చి 13 : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు, ఓ కోఆప్షన్ సభ్యుడు, పలువురు సీనియర్ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒకటవ వార్డు కౌన్సిలర్ అప్పల ఇందిర, 4వ కౌన్సిలర్ జాజాల జ్యోతి, 7వ వార్డు కౌన్సిలర్ కాకనూరి నాగమ్మ, 9వ వార్డు కౌన్సిలర్ కొండూరు లలిత, 10వ వార్డు కౌన్సిలర్ బాదం సునీత, 20వ వార్డు కౌన్సిలర్ పద్మమ్మ, 19వ వార్డు కౌన్సిలర్ బచ్చన్న యాదవ్‌తో పాటు మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు నరసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాదం నరేందర్, మాజీ వార్డు సభ్యులు పాండుచారి, ఎండబెట్ల శ్రీనివాస్‌తో పాటు మరికొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కారాజ్‌కుమార్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, ఎండి.నిజామ్, సునేంద్రకుమార్ నాయకులు కొత్త బలరాం తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

గృహిణి ఆత్మహత్య


సరిత (ఫైల్)

కొత్తకోట, మార్చి 13 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మళపల్లి గ్రామంలో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సరిత (25) ఇద్దరు పిల్లలతో పాటు, భర్త, అత్తమామ ఇటిక్యాల మండలం జల్లపూర్‌లో జరుగుతున్న బంధువుల పెళ్లికి బుధవారం ఉదయం వెళ్లిపోయారు. తనను ఒక్కదానిని ఇంట్లో వదిలేసి అందరూ పెళ్లికి వెళ్లడంతో మనస్తాపం చెందిన ఆమె మధ్యాహ్న సమయంలో ఉరి వేసుకొంది. పక్కింటివారు ఆమెను పిలిచినా పలుకకపోవడంతో అనుమానం వచ్చి ఇల్లు తెరిచి చూశారు. ఉయ్యాల కొండ్లకు తాడుతో ఉరి వేసుకున్న ఆమెను చూసి చుట్టుపక్కల వారి సహాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. వెంటనే భర్త మారుతి, అత్తమామలకు సమాచారం ఇచ్చారు. సరిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

పెద్దకొత్తపల్లి, మార్చి 13 : కుటుంబ కలహాల వల్ల ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధితురాలు, హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామానికి చెందిన గుంటి శివలీలను ఆమె అన్న గుంటి సుధాకర్, అతని భార్య గుంటి నవీన, గుంటి శేఖర్, భార్య జయమ్మలు కలిసి పాత గొడవలు మనసులో పెట్టుకుని నానా బూతులు తిట్టి, జుట్టు పట్టుకొని ఇంట్లో నుంచి రోడ్డుపైకి ఈడ్చుకుంటూ వచ్చి కడుపులో తన్నుతూ దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా చంపుతామంటూ బెదిరిస్తూ అడ్డొచ్చిన శివలీల అమ్మ లక్ష్మీదేవమ్మపై కూడా దాడి చేసి గాయపర్చారన్నారు. దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పడంతో గుంటి శివలీల వెంటనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో కుటుంబ సభ్యులు, పోలీసులు వెంటనే 108లో చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శివలీలపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంచంద్రయ్య తెలిపారు.

పులి దాడిలో ఎద్దు మృతి


పులిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

దోమలపెంట, మార్చి 13 : నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతం అమ్రాబాద్ అభయారణ్యం దోమలపెంట రేంజ్ పరిధిలోని సార్లపల్లి సౌత్ బీట్‌లో మంగళవారం పశువుల మందపై పెద్ద పులి దాడి చేసి ఎద్దును చంపి వేసినట్లు రైతు మండ్లి ఈరయ్య అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ ఆదేశం మేరకు బుధవారం ఎఫ్‌బీవో ముత్యాలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులి దాడిలో ఎద్దు మృతి చెందినట్లు నిర్ధారణ చేసి పంచనామా నిర్వహించారు. పులిని గుర్తించేందుకు ఘటనా స్థలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎఫ్‌బీవో ముత్యాలు పేర్కొన్నారు. పంచనామా నివేదికను పైఅధికారులకు అందిస్తామని, రైతుకు అటవీశాఖ తరుపున నష్టపరిహారం అందిస్తామని అధికారులు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.40వేలు ఉంటుందని రైతు ఈరయ్య పేర్కొన్నాడు.

కర్ణాటక మద్యం పట్టివేత, ఇద్దరిపై కేసు నమోదు


పట్టుకున్న కర్ణాటక మద్యంతో పాటు, నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

గద్వాల క్రైం, మార్చి 13 : కర్ణాటక నుంచి తెలంగాణకు తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం కుట్కనూరు గ్రామ శివారులో మంగళవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కర్నూల్‌కు చెందిన కుర్వమల్లేష్, కుర్వరాముడు ఇద్దరు రెండు వాహనాలపై కర్ణాటక రాష్ట్రానికి చెందిన 25.92 లీటర్ల ఒరిజనల్ చాయిస్ మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని, స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు వెంకటేష్, నాగరాజు, కానిస్టేబుల్స్ మహేష్, వేణు, శేఖర్, రాజు తదితరులున్నారు.

భూమి రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

జడ్చర్ల, మార్చి 13 : మోసపూరితంగా సంతకాలు చేయించుకుని భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం దాసరి సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్సై శివానంద్ తెలిపారు. గ్రామ శివారులోని సరోజ స్వంత పొలంలో కూలీ పనులకు వచ్చిన కూలీలకు ఓ అనాథ బాబు కనిపించడంతో ఆ బాబును తీసుకువచ్చి తన తల్లి దాసరి అనసూయమ్మకు ఇచ్చారు. ఆ బాబుకు శ్రీనివాసులు అని పేరుపెట్టి తనతో పాటు పెంచుకుందని దాసరి సరోజ ఫిర్యాదులో పేర్కొందని తెలిపారు. పది సంవత్సరాల క్రితం తన తల్లిదండ్రులు మృతి చెందారని, తన తల్లి అనసూయమ్మ పేరుపై నాలుగెకరాల 28 గుంటల భూమి ఉందని, ఆ భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయిస్తానని మోసపూరితంగా తనతో సంతకాలు తీసుకుని, తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొందని వివరించారు. మోసపూరితంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయంపై ప్రశ్నిస్తే చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని, న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కర్రతో బండి చక్రం

గడియారం, సీసా లోపల ఐన్‌స్టీన్ చిత్రం

పెద్దకొత్తపల్లి, మార్చి 13 : కర్రతో బండి చక్రం, కర్రతో గడియారం తయారీ, సీసా లోపలి ఉపరితలంపై ఐన్‌స్టీన్ చిత్రం వేసినట్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత బసవోజు బ్రహ్మచారి తెలిపారు. మార్చి 14 భౌతిక శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ జయంతి, అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రపటాలను వేసినట్లు ఆయన చెప్పారు.



కర్రతో చేసిన చక్రాలు

వివాహ వేడుకలో భారీ దొంగతనం

- 30 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన దుండగుడు
- సీసీ కెమెరాలో అనుమానితుడి ఆనవాళ్లు

గద్వాల క్రైం, మార్చి 13 : జోగుళాంబ గద్వాల జిల్లాను కొంతకాలంగా దొంగలు దత్తత తీసుకున్నట్లు ఉన్నది. జిల్లాలో ప్రతీరోజు ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల కంటే జిల్లా కేంద్రంలోనే ఈ ఘటనల సంఖ్య పెరిగిపోయింది. తాజాగా ఓ వివాహ వేడుకలో కూడా మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగ ఒకరు ప్రవేశించి 30 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక కృష్ణారోడ్‌లోని ఎస్.వీ. ఈవెంట్ హాలులో బుధవారం రాజకీయ నాయకుడు అయిన బీరెల్లి రాధాకృష్ణారెడ్డి వివాహం జరగాల్సి ఉంది. అయితే రాధాకృష్ణారెడ్డి తమ్ముడు అయిన కృష్ణవర్ధన్‌రెడ్డి, ఆయన కుటుంబం మంగళవారం రాత్రే ఫంక్షన్‌హాల్‌కు వచ్చారు. పెళ్లికని వారు తెచ్చుకున్న 30 తులాల బంగారు ఆభరణాలను ఓ బ్యాగులో ఉంచారు. మంగళవారం రాత్రి ఒంటి గంట వరకు వారు పెళ్లి కార్యక్రమాలను పూర్తిచేసుకొని నిద్రలోకి జారుకున్నారు. బుధవారం ఉదయం కృష్ణవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ కోసం వెతకగా కనపడలేదు. దీంతో దొంగతనం జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్ఐ సంఘటనా స్థలానికి పరిశీలించాడు. క్లూస్‌టీంలతో వివరాలను సేకరించారు. అర్ధరాత్రి 2 గంటల తర్వాత ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ఫంక్షన్‌హాల్‌లోకి ప్రవేశించి ఆ ఆభరణాలు ఉన్న సంచిని దొంగిలించి తీసుకెళుతున్నట్లు వీడియో సీసీ కెమెరాలో నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నానన్నారు.


చోరీ జరిగిన ఫంక్షన్‌హాల్‌లో ఆనవాళ్లను సేకరిస్తున్న క్లూస్‌టీం సిబ్బంది

తాళం వేసిన ఇంట్లో చోరీ

గోపాల్‌పేట, మార్చి 13 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మునగాల శివానందం రావు అతని భార్య శనివారం రోజు పని నిమిత్తం హైదరాబాద్‌లోని తన చెల్లెలి ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగుడు మంగళవారం అర్ధరాత్రి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగలగొట్టి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లాడు. శివానందానికి వరుసకు బాబాయ్ అయిన పెంటయ్య గమనించి ఇంట్లో దొంగలు పడ్డారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణ జరుగుతుండగా అదే గ్రామానికి చెందిన ఏశమోని ఆంజనేయులు బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు ఆపి అతనిని తనిఖీ చేశారు. అతని వద్దనున్న బ్యాగులో బంగారం, నగదు కనిపించాయి. ఆంజనేయులును అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుల్ వంశీ, ఆంజనేయులును అధికారులు అభినందించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ నాగభూషణ్‌రావు, క్లూస్ టీం ఏఎస్సై రవి పరిశీలించారు.

పంట వ్యర్థాల డీకంపోజర్‌తో నేలకు పోషకాలు



వేస్ట్ డీకంపోజర్‌తో నేలకు కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న రావేఫ్ విద్యార్థులు

బిజినేపల్లి, మార్చి 13 : పంట నూర్పిడి తర్వాత వచ్చే వ్యర్థాలను వేస్ట్ డీకంపోజర్‌తో ఎరువులుగా మార్చుకుంటే నేలలో పంటల సాగుకు కావల్సిన పోషకాలను పెంచుకోవచ్చని రావేఫ్ విద్యార్థులు అన్నారు. మండలంలోని మంగనూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పాలెంలో ఏజీ బీఎస్సీ 4వ సంవత్సరం చదువుతున్న రావేఫ్ విద్యార్థినులు పంట వ్యర్థాలను త్వరగా కులిపోయేలా చేసే వేస్ట్ డీకంపోసర్ ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన డాక్టర్ కిషన్ చంద అనే శాస్త్రవేత్త రూపొందించగా డీకంపోసర్ ఎన్‌సీవోఎఫ్ అనే సంస్థ ఘజీయాబాద్‌లో 2015లో విడుదల చేసినట్లు తెలిపారు. 30 గ్రాములు ఉండే డీకంపోజర్ లిక్విడ్ బాటిల్‌ను రూ.40లకు లభిస్తుందన్నారు. 30 గ్రామలు డీకంపోజర్‌ను రెండు వందల లీటర్ల నీటిలో రెండు కిలోల బెల్లంతో పాటు కలుపుకొని రైతులు స్వయంగా తయారు చేసుకోవచ్చని సూచించారు. దీనిని విత్తనశుద్ధిలో, ఫర్టిలైజర్‌గా, బయో పెస్టిసైడ్‌గా ఏఏ మోతాదులో వినియోగించాలో రైతులకు ప్రత్యక్షంగా చేసి వివరించారు. కార్యక్రమంలో ఏజీ బీఎస్సీ విద్యార్థులు నిహారిక, ప్రణయ, వైష్ణవి, నివేదిత, వైష్ణవి రెడ్డి, గ్రామ రైతులు ఉన్నారు.

నేడు గంగ మంత్రాలమ్మ సిడె



జనుంపల్లిలోని గంగమంత్రాలమ్మ అమ్మవారు

కోడేరు, మార్చి 13 : భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం గంగ మంత్రాలమ్మగా పేరున్న గంగ మంత్రాలమ్మ (జాతర) సిడె గురువారం నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని జనుంపల్లి శివారులో వెలసిన గంగ మంత్రాలమ్మ జాతర సిడెతో ప్రారంభమై 15 రోజుల తర్వాత నెలపూజతో ముగుస్తుందని ఆలయ పూజారి పలగొర్ల రాములు, మంతయ్య, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం... పూర్వం యాదవుల కుల దేవతగా వెలసిన గంగ మంత్రాలమ్మ కాలక్రమంలో భక్తుల కోరికలు తీరుస్తూ ఉమ్మడి జిల్లాలోనే భక్తుల పూజలు అందుకుంటూ కోరిన కోరికలు తీర్చే దేవతగా పేరుందని అన్నారు. మొదట యాదవ సోదరులు పలగొర్ల వారి దేవతగా ఉండి నేటికి కూడా వారే పూజారులుగా ఉన్నారు. సిడె రోజు మంత్రాలమ్మ గుడి చుట్టూ రథం తిప్పుతూ రథంతో పాటు బోనాలను ఎత్తుకొని మహిళలు కొబ్బరికాయలు, కోళ్ళు, గొర్లు, మేకలను చిన్న పెద్ద తేడా లేకుండా అందరు ప్రదక్షిణలు చేసిన అనంతరం తమ తమ కోరికలు కోరుకుంటూ మొక్కులు తీర్చుకుంటారు. ఈ గంగమంత్రాలమ్మ జాతరకు ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నా



ఆర్డీవో కార్యాలయంలో ఏవో సరితకు వినతి పత్రాన్ని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కల్వకుర్తి, మార్చి 13: మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం కల్వకుర్తిలోని ఆర్డీవో కార్యాలయం ముందు సీఐటీయూ నాయకులతో కలిసి మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు 2023 నవంబరు నుంచి కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, అల్పాహారం బిల్లులు పెండింగులో ఉన్నాయని అన్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు వంటలు చేసి పెడుతున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించరాదని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలోని ఎస్‌వో సరితకు అందజేశారు. మధ్యాహ్నం భోజన కార్మికుల యూనియన్ కల్వకుర్తి అధ్యక్షురాలు జహీదా, వంగూరు. ఊర్కొండ మండలాల నాయకులు చంద్రకళ, నిరంజన్‌బీ, కల్వకుర్తి మండల ఉపాధ్యక్షురాలు నిర్మల, రేణుక, మల్లేశ్వరి, శ్రీ:లం, లక్ష్మమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండపల్లి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి

తెలకపల్లి, మార్చి 13 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద మెరిట్ విద్యార్థులకు సిగ్మా మైక్రో సిస్టమ్ మేనేజింగ్ డైరెక్టర్ సీఎల్ఆర్ విద్యా సంస్థ సభ్యుడు చీమర్ల దామోదర్‌రెడ్డి అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఎస్ఐ బి.నరేష్, కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి మెరిట్ విద్యార్థులకు మండల పరిధిలోని సీఎల్ఆర్ విద్యా సంస్థ కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు రెండు నెలలకు సంబంధించిన నగదు పురస్కారాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచాలి

- చెకుముకి టాలెంట్ టెస్టు విజేత అభినందన సభలో కలెక్టర్



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

తెలకపల్లి, మార్చి 13 : జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాల్సినవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన ఆలేరు ఉన్నత పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉందని, అక్షరాస్యత పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. విద్యార్థులు నిరక్షరాస్యులైన తమ తల్లిదండ్రులకు అక్షర జ్ఞానాన్ని అందించాలని తద్వారా నిరక్షరాస్యత నిర్మూలించవచ్చని ఆయన పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాల్సినవసరం ఉందని, దీని కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. డీఈవో గోవిందరాజులు, ప్రొఫెసర్ కో వెంకటేశ్వర్‌రావు, బీఎస్.రెడ్డి, జేవీవీ ఉపాధ్యక్షుడు జితేందర్, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణయ్య, డీఎస్‌వో కృష్ణారెడ్డి, ఏఎంవో షర్ఫుద్దీన్, ఎంఎన్‌వో శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ మల్లికార్జున్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు బాలకృష్ణరావు, లావణ్య, వెంకటేశ్వర్లు, దేవరాజు, విద్యావతి, జయశ్రీపాల్గొన్నారు.

ఘనంగా కవిత జన్మదిన వేడుకలు

కల్వకుర్తి, మార్చి 13: కల్వకుర్తి పట్టణంలోని జాగృతి కార్యాలయంలో భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా భారత జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. జిల్లా జాగృతి నాయకులు మిరియాల పావణి, దారమోని గణేష్, వట్టేపు కిషోర్, వాణి, ప్రణీత్, రమేష్, జంగయ్య నాగరాజు, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తండ్లాట

- వేసవికి ముందే ఏజెన్సీ గ్రామంలో నీటి ఎద్దడి
- ఇబ్బందులు పడుతున్న పద్మారం తండా వాసులు

అచ్చంపేట రూరల్, మార్చి 13 : వేసవికాలం రాక ముందే అచ్చంపేట మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంటున్నది. మండల పరిధిలోని ఏజెన్సీ గ్రామాలైన పద్మారం, పుల్‌దేవ్‌బండతండాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. పద్మారం, పుల్‌దేవ్‌బండతండాల్లో మిషన్‌భగీరథ ద్వారా వచ్చే తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఒక్కోసారి వారం రోజుల వరకు తాగు నీరు రావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ రెండు తండాల్లో 110 కుటుంబాల్లో దాదాపు 500 మంది ప్రజలు ఉన్నారు. తండాలో ఉన్న మినీ ట్యాంక్ ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదని, ట్యాంకుకు సమీపంలో ఉన్న వారికే నీరు వస్తుందని, దూరంగా ఉన్న వారికి నీటి సరఫరా జరగడం లేదని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ట్యాంకులకు అనుసంధానించిన బోర్లలో నీరు అడుగంటుతున్నందున నీటి లభ్యత తక్కువగా ఉందని, మిషన్ భగీరథ ద్వారా నీరు రాకుంటే మా పరిస్థితి దయనీయంగా ఉంటుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తండాలల్లో అదనంగా బోర్లు వేయించి రానున్న వేసవికాలం నీటి ఎద్దడి నుంచి ఆదుకోవాలని కోరుతున్నారు.

● **నీటి ఎద్దడి నివారణకు చర్యలు**

రానున్న వేసవికాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. రానున్న ఎండాకాలం తీవ్రత దృష్ట్యా నీటి ఎద్దడికి గురయ్యే మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. పగిలిపోయిన పైపులకు వాల్వ్‌లను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచించడం జరిగింది. నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకుగాను ఇప్పటికే పాత బోరు బావులను గుర్తించి ఫ్లషింగ్ చేయిస్తున్నాని, వ్యవసాయ భూముల్లో అధికంగా నీటి నిల్వ ఉన్న బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం. నీటి ఎద్దడి ఉన్న గ్రామ ప్రజలు మిషన్‌భగీరథ నీటిని తాగడానికే మాత్రమే ఉపయోగించాలి. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు తాగునీరు, సాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి.

– బాలచంద్రసుజన్, ఎంపీడీవో, దేవరకొండ



నీటి సరఫరా చేస్తున్న ట్యాంకర్

వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం

పద్మారంతండాకు మిషన్‌భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. అంతేకాక ఒక మినీ ట్యాంక్, బోరు ద్వారా తండాకు నీటి సరఫరా జరుగుతుంది. సాంకేతిక కారణాల ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. పుల్‌దేవ్‌తండాలో బోరు ఉంది.

– ఆర్.భగవాన్, పంచాయతీ కార్యదర్శి

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి13: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పార్లమెంటు ఎన్నికలపై దళిత, బహుజన సంఘాలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను బడా వ్యాపార సంస్థలకు తక్కువ ధరలకు అమ్మేసి దేశాన్ని మరింత పేదరికంలోకి నెట్టిందని ఆరోపించారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు గెలిచి భారత రాజ్యాంగాన్ని మార్చి దేశాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. నల్లధనం వెలికి తీస్తానన్న మోదీ నోట్ల రద్దుతో బడా నేతలు దాచుకున్న డబ్బును తెల్లధనంగా మార్చారని ఆరోపించారు. బీజేపీ పాలనలో దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డీ విరిచారని విమర్శించారు. 2014 ముందు దేశంలో 5.44 శాతం ఉన్న నిరుద్యోగ రేటు బీజేపీ పాలనలో నేడు 8.70 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే దళిత, గిరిజన, మైనార్టీలను ఊచకోత కోయడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, యువత ఆలోచించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మారేడు యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చపోతు శంకర్, నాయకులు సుధాకర్, మధుసూదన్, మొట్ట కురుమయ్య, విష్ణు, జెట్టి కుర్మయ్య, బాలపీరు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

రాయలగండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన
- పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

అమ్రాబాద్ మార్చ్ 13: నల్లమల ప్రాంతంలో ఎత్తైన కొండపై వెలసిన ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం రాయల గండి లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ప్రత్యేక పూజల అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ అనురాధ దంపతులతో పాటు పెద్ద ఎత్తున హాజరైన భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో డాక్టర్ వంశీకృష్ణ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పూర్ణాహుతి హోమంలో పాల్గొన్నారు. గురువారం ఆలయంలో జరిగే శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇమ్మడి నరహరి, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

అమ్రాబాద్ జడ్పీ హెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తరపున అమలు అయ్యేటట్లు చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల జీహెచ్ఎం బాలకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం ఆవరణలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ సమీపంలో గల మిషన్ భగీరథ పంపు హౌస్ వద్ద మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రస్తుతం గ్రామాలకు తాగునీటి సరఫరా తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవ్వని గ్రామాల్లో రక్షిత నీటి బోర్ల ద్వారా నీటి సరఫరా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ డీఈ మణిపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత, ఏఈలు పాల్గొన్నారు.

16 కార్పొరేషన్లు ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం

కల్వకుర్తి, మార్చి 13: 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకొన్న నిర్ణయం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షిస్తూ బుధవారం కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని అన్నారు. 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా కులాలకు చేయుత దొరుకుతుందని అన్నారు. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జూలూరు రమేష్‌బాబు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి ఆయా కులాల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక నిర్ణయమని ముదిరాజ్ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జమ్ముల శ్రీకాంత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కార్పొ రేషన్ ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక, సామాజిక సాధికారతతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిసుందని ఆయన పేర్కొన్నారు.

మాల కులాల కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

మాల కులాల అభివృద్ధికి, అభ్యున్నతికి దోహద పడే విధంగా తీర్చిదిద్ది కార్పొ రేషన్ ఏర్పాటును ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేయడం ఎంతో అభినందనీయమని కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దళితుల గురించి ఆలోచించి కార్పొ రేషన్ ఏర్పాటు చేయడం ఎంతో చారిత్రాత్మకమైన ఆలోచన విధానమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

నాగర్‌కర్నూల్ టౌన్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లోనే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల నాగరాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన ముదిరాజ్ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా వెనకబాటుకు గురైన ముదిరాజ్ సమాజం సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంతో మేలు చేకూరడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుకు కీలక భూమిక పోషించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జింకల గణేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రమేష్, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఘనంగా స్వయం స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కల్వకుర్తి, మార్చి 13: కల్వకుర్తి మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి పాఠాలను బోధించారు. కలెక్టరుగా కె. బాసుకుమార్, డీఈవోగా ఎండి. సయ్యద్, ఎంఈవోగా వర్షిత్, హెచ్‌ఎంగా గణేష్‌తో పాటు మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. ఎంఈవో బాసునాయక్ హాజరయ్యారు. హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు చంద్రకళ, స్వప్న, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి తదతరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం

కల్వకుర్తి, మార్చి 13: కల్వకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరాములు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ఇంటి ట్యాక్స్‌ల గురించి సమావేశంలో చర్చించడం జరిగిందని అన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా కొర్ర రమేష్



కొల్లాపూర్, మార్చి 13 : కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల భూసార పరీక్షా కేంద్రం అధికారిగా ఆయా మండలాల వ్యవసాయ అధికారిగా కొర్ర రమేష్ బుధ వారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత వ్యవసాయ అధికారి ఉన్న నాగరాజు డిప్యూటేషన్ మీద మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. పది సంవత్సరాలుగా కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల ఏవోగా విధులు నిర్వహించి నాగరాజు సేవలనురైతులు,నాయకులు ప్రశంసించారు.

'యాదవ కార్పొరేషన్‌కు పదివేల కోట్లు కేటాయించాలి'

ఉప్పునుంతల, మార్చి 13 : తెలంగాణ ప్రభుత్వం యాదవ కార్పొరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్‌కు పదివేల కోట్లు కేటాయించాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇడమోని మల్లేష్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో వారు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా యాదవ హక్కుల పోరాట సమితి హర్షం వ్యక్తం చేసింది. జాతీయ యాదవ యుద్ధనౌక రాములుయాదవ్ గత 15 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో భాగంగా ధర్నాలు, రాస్తారోకోలు, అసెంబ్లీ ముట్టడి లాంటి ఎన్నో పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శంకర్, శేఖర్, శ్రీను, విష్ణు, లక్ష్మణ్, ఎల్లయ్య, సైదులు, తదితరులు ఉన్నారు.

తుమ్మలకుంట తండాలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

తిమ్మాజిపేట, మార్చి 13: తిమ్మాజిపేట మండల పరిధిలోని తుమ్మలకుంట తండాలో బుధవారం సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్, బద్దు వెంకటేశ్‌లు పూజలు నిర్వహించి ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులకు ఐదు లక్షలు మంజూరు చేయడం హర్షదాయకమని కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేష్, రామాంజ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 13: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా 32 పరీక్ష కేంద్రాల పరిధిలో మొత్తం విద్యార్థులు 7670 మందికి గాను 7150 మంది హాజరు కాగా, 520 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 5870 హాజరు కాగా 377 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు 1280 మంది హాజరు కాగా 143 మంది గైర్హాజరు అయినారని ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి జి.వెంకటరమణ తెలిపారు.

● కల్వకుర్తి: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి. కల్వకుర్తి పట్టణంలో 7 పరీక్షా కేంద్రాల్లో 1,588 విద్యార్థులకు గాను 1,475 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని 113 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజర్ అయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎగ్జామ్ చీఫ్ సూపరిండెంట్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మంచి వాతావరణంలో విజయవంతంగా ముగిశాయని సహకరించిన కస్టోడియన్, డీవో, సీఎస్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇన్విజిలేటర్లుకు ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి, అభినందనలు తెలియజేశారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం

వంగూరు, మార్చి 13: మండలంలోని సాయిగుట్టతండాలో బుధవారం రూ.1 కోటి నిధులు మంజూరైన బీటీ రోడ్డు పనులను ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ మల్లయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటీ రోడ్డు అవసరాన్ని గుర్తించి తండావాసుల కోరిక మేరకు ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో తిప్పారెడ్డిపల్లి గేటు నుంచి సాయిగుట్టతండా వరకు బీటీ రోడ్డు మంజూరు అయ్యిందన్నారు. పాండురంగారెడ్డి, పండిత్‌రావు, కడారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

16న జిల్లా మాల మహానాడు ఎన్‌జీసీ ఎగ్జిబిషన్

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి13: జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఈ నెల 16న జాతీయ హరిత దళాలు (ఎన్‌జీసీ) ఎగ్జిబిషన్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిబిషన్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు తయారు చేసిన హ్యాండీక్రాఫ్ట్స్‌ను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రదర్శనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా నగదు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పూర్తి వివరాలకు కోసం జిల్లా సైన్స్‌అధికారిని సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

వంగూరు, మార్చి 13: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జాతీయ ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో విజయభాస్కర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని, వేసవి కాలం కావడంతో వననర్సరీలలో మొక్కలకు నీటి తడులు అందించి ఎండిపోకుండా చూడాలన్నారు. గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో తాగునిటి ఎద్దడి తలెత్తకుండా, పారిశుద్ధ్య నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

చారకొండ, మార్చి 13: నర్సరీలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. బుధవారం మండలంలోని కమాల్‌పూర్‌తండా, సారంబండతండాలో ఎంపీడీవో నర్సరీలు, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటిక, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా షేడ్ నెట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. నర్సరీలో కలుపు మొక్కలను తొలగించి బ్యాగుల్లో చనిపోయిన మొక్కల స్థానాల్లో విత్తనాలను నాటాలని అన్నారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతీ రోజు రెండు పూటల నీళ్లు అందించాలని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇంటి పన్ను నూరుశాతం కట్టి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామాల్లో పాడైపోయిన పంపుసెట్లకు మరమ్మతులు చేపట్టి నీటి ఎద్దడి లేకుండా చూడాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు సైదులు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు

ఉప్పునుంతల, మార్చి 13 : మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో బుధవారం సీడీపీ నిధుల నుంచి 3 లక్షల రూపాయలతో గ్రామంలో ప్రధాన రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. వీధి లైట్లు ఏర్పాటు కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలుపుదల చేశారు. ఆ నిధులు వాడుకోవడానికి ప్రస్తుతం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆమోదం తెలిపినందుకు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీంద్రారావు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ, మార్చి 13 : మండల పరిధిలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన కొమ్ము సుగుణమ్మ మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 5 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, దాసు, పెద్దయ్య, అంతిరెడ్డి తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఉప్పునుంతల/పెద్దమందడి, మార్చి 13 : ఉప్పునుంతల మండలం పెద్దాపూర్ గ్రామంలో బుధవారం రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. గ్రామానికి చెందిన తోళ్ల రమేష్, జల్లెల రమేష్‌కు చెందిన ట్రాక్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా దుందుభి వాగు నుంచి ఇసుకను లక్మాపూర్ వైపు రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఊర్కొండలో చలివేంద్రం ప్రారంభం

ఊర్కొండ, మార్చ్ 13: మండల కేంద్రంలోని ప్రధాన గేటు కల్వకుర్తి జడ్చర్ల ప్రధాన రహదారిపై బుధవారం ఎంజేఆర్ యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ కలీం పాషా టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరారెడ్డి, నాయకులు జంగయ్య, రమేష్, అమరేశ్వర్ రెడ్డి, మ్యాకల శ్రీనివాసులు, ఆంజనేయులు, రాజయ్య, హరీష్, సందీప్, లక్ష్మారెడ్డి , రమేష్ నాయక్, కొమ్మశీను, గోపి, మలేష్, తదితరులు ఉన్నారు.

బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా శివకుమార్



తిమ్మాజిపేట, మార్చి 13 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నాగర్‌కర్నూల్ అసెంబ్లీ బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా సావుకుల శివ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ బీజేపీకి విధేయుడుపై ఉంటానని పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. సోషల్ మీడియా ద్వారా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు బాధ్యతగా వ్యవహరిస్తామన్నారు. బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా తనను నియమించిన బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.